సాక్షి
నారాయణపేట
మంగళవారం • 3 • జూన్ • 2025



పాలమూరు శుభారంభం

ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ అండర్– 19 లీగ్‌లో మహబూబ్‌నగర్ జట్టు శుభారంభం చేసింది.

వివరాలు IIలో ▸



జూరాలకు ఇన్‌ఫ్లో

జూరాలకు వస్తున్న ఇన్‌ఫ్లో సోమవారం స్వల్పంగా పెరిగినట్లు అధికారులు తెలిపారు.

వివరాలు IIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
37.4 /22.3

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోత పెడుతుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

నారాయణపేట రూరల్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకూ కొనసాగుతాయి. పరీక్షల కోసం జిల్లా విద్యా శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టికెట్లు కూడా పంపించింది. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 367 మంది హాజరుకానున్నారు. వీరిలో 228 బాలురు, 139 బాలికలు. అత్యధికంగా సైన్స్ లో 206, గణితంలో 178, ఇంగ్లీష్ లో 110 మంది ఫెయిల్ కాగా తెలుగు 72, సోషల్ 41, హిందీ 21మంది ఉన్నారు. వీరి కోసం జిల్లా కేంద్రంలో ఒకే ఒక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పట్టణంలోని ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన కేంద్రానికి సీఎస్ గా సత్యనారాయణ సింగ్, డీఓ గా అనిఫ్ ను నియమించారు. పరీక్షలకు 11మంది ఇన్విజిలేటర్స్ విధులునిర్వహించనున్నారు.

18 మందికి పదోన్నతి

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న 18 మంది కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పిస్తూ జోగుళాంబ జోన్–7 డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా పదోన్నతి వచ్చిన హెడ్‌కానిస్టేబుళ్లను డీఐజీ అభినందించారు. హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన వారిలో సయ్యద్ యాసిన్, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకప్ప, వి.నాగరాజురెడ్డి, చెన్నకేశవులు, షాకీర్ ఖాన్, ఎజాజ్ అహ్మద్ ఖాన్, ఎండీ రియాజ్, బాలయ్య, వెంకట్‌నాయక్, పి.నాగరాజుగౌడ్, ఎండీ అక్బర్, నరేష్‌కుమార్, వెంకట్‌రెడ్డి, రాజారమేష్, కె.నాగరాజు, కె.విజయ్‌కుమార్ ఉన్నారు.

పోలీస్ పాత్ర కీలకం



మహబూబ్‌నగర్ క్రైం: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో పోలీస్ శాఖ ఎంతో కీలకమని డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం జోగుళాంబ జోన్– 7 డీఐజీ కార్యాలయం ఎదుట డీఐజీ జాతీయ జెండా ఆవిష్కరించారు. ప్రజల రక్షణ కోసం పోలీస్ సిబ్బంది కట్టుబడి పనిచేయాలన్నారు. అలాగే ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ జానకి జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల కృషి అభినందనీయమన్నారు. పోలీసులు క్రమశిక్షణతో సేవలు అందిస్తూ ప్రజల అభిమానం గెలుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ సురేష్‌కుమార్, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పీయూలో ఎగ్జామినేషన్ కోఆర్డినేటర్ల నియామకం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఎగ్జామినేషన్ కోఆర్డినేటర్లను కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రవీణ సోమవారం నియమించారు. ఈ మేరకు గత కొన్ని సంవత్సరాలుగా ఫార్మసీ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్న ఈశ్వర్‌కుమార్, రవీందర్‌రెడ్డిలను నియమిస్తూ.. ఉత్తర్వులను వారికి అందజేశారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి



తెలంగాణ రైజింగ్‌–2047 విజన్‌తో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు..

- మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం
- రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఆర్.గురునాథ్‌రెడ్డి
- కలెక్టరేట్‌లో అట్టహాసంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

జాతీయ జెండాకు వందనం చేస్తున్న రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఆర్.గురునాథ్‌రెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీయోగేష్ గౌతమ్, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

నారాయణపేట: రాష్ట్రాన్ని ప్రపంచ వేదికపై ఆవిష్కరించడంలో విజయం సాధించామని.. అమెరికా, దక్షిణకోరియా, సింగపూర్, దావోస్, జపాన్ దేశాలలో పర్యటించి భారీగా పెట్టుబడులు సాధించడం జరిగిందని.. ఇక జిల్లా విషయానికి వస్తే ప్రజాపాలనలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని, జిల్లా సర్వతోముఖాభివృద్ధికి మనమంతా కంకణబద్ధులు కావాలని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఆర్.గురునాథ్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, ఎస్పీయోగేష్ గౌతమ్, అడిషనల్ కలెక్టర్ సంచిత్‌గంగ్వార్, గ్రంథాలయ సంస్థల జిల్లా చైర్మన్ వార్ల విజయ్‌కుమార్‌తో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ముందుగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గురున్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనూ, ప్రపంచస్థాయిలోనూ అగ్రస్థానంలో నిలిపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైసింగ్ 2047 విజన్‌తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఇందులో నాలుగు కీలక అంశాలు ఉన్నాయని అవి పేదల సంక్షేమం, సమగ్ర పాలసీల రూపకల్పన, ప్రపంచ స్థాయి ఇన్ఫ్రా డెవలప్‌మెంట్, పారదర్శక సుపరిపాలన లక్ష్యాలకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ లక్ష్యాల సాధనకు ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు చేపట్టిందని, తెలంగాణ సమగ్ర అభివృద్ధికి ఇప్పటికే వెల్ఫేర్ అండ్ సోషల్ జస్టిస్ పాలసీ, గ్రీన్ ఎనర్జీ పాలసీ, ఇన్ఫ్రా అండ్ ఇండస్ట్రీయల్ పాలసీ, టూరిజం పాలసీలను ప్రభుత్వం సిద్ధం చేసిందని చెప్పారు.

విద్యకు పెద్దపీట

జిల్లా కేంద్రంలో, కోస్గిలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు ప్రారంభించారని, మిషన్ భగీరథ ఇంట్రగ్రిడ్ ద్వారా వేసవి కాలంలో నీటి ఎద్దడి నివారణకు జిల్లాకు రూ.92.91 లక్షలు మంజూరు చేశారన్నారు. ప్రజాపాలన, మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి 3,566 కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో శాంతి భద్రతల కల్పనలో భాగంగా పోలీస్ శాఖ నుంచి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి రూ.2.79 కోట్లతో ధన్వాడ పీఎస్‌ను, 2.79 కోట్లతో పేట రూరల్ పోలీస్ స్టేషన్‌ను సీఎం చేతుల మీదుగా ఇదివరకే ప్రారంభించడం జరిగిందన్నారు. ఎస్పీ కార్యాలయం భవన నిర్మాణానికి 7 ఎకరాల ల్యాండ్ , 38.50 కోట్ల రూపాయల బడ్జెట్ మంజూరు అయ్యిందని వివరించారు.

రైతులకు రుణ విముక్తి

దేశ చరిత్రలో నిలిచిపోయేలా అధికారంలోకి వచ్చిన కేవలం 8 నెలల్లోనే రూ.25,35,964 మంది రైతులకు రూ.20,617 కోట్లు రుణ మాఫీ చేయడం జరిగిందన్నారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ. 12 వేలు అందిస్తున్నామని, రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తున్నామన్నారు. గతేడాది రూ.2.90 కోట్ల టన్నుల ధాన్యం పండించి తెలంగాణ రైతులు దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ చేయడం జరిగిందన్నారు. యువతే ప్రజా ప్రభుత్వ నిజమైన నిర్మాతలని, వారి భవిష్యతుకు గ్యారంటీ ఇస్తూ యువత ఉపాధి ఉద్యోగ కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని మొదటి ఏడాదిలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామన్నారు. నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, ఆర్డీఓ రాంచందర్‌నాయక్, కలెక్టరేట్ ఏఓ జయసుధ, పీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్.గురునాథ్‌రెడ్డి

లక్ష ఎకరాలకు సాగునీరు..

నారాయణపేట – కొడంగల్ – ఎత్తిపోతల పథకంతో లక్ష ఎకరాలకు సాగు నీరు అందించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది వానాకాలం 4.35 లక్షల ఎకరాల్లో సాగు అయ్యే వివిధ పంటల కోసం అవసరమయ్యే విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచడం జరిగిందని, 1.4 కోట్ల సబ్సిడీ విలువగల జీలుగ జనుము విత్తనాలు రైతులకు పంపిణీ చేయబోతుందన్నారు. ఈజీఎస్ ద్వారా జిల్లాలో 1,10,727 జాబ్‌కార్డులు ఉండగా రూ.1294.13 లక్షల ఖర్చు అయ్యిందన్నారు. ఆసరా కింద 75,449 మంది లబ్ధిదారులకు ప్రతి నెల రూ. 18.86 కోట్లు చెల్లించడం జరిగిందన్నారు. బ్యాంకు లింకేజీ రూ.263.43 కోట్లు మహిళ సంఘాలకు చెల్లింపులు, నాలుగు ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్లు, మిల్క్ పార్లర్ పాడి గేదేల పెంపకం, పైడి కోళ్ల పెంపకం తదితర వాటిని ప్రారంభించడం జరిగిందన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు..

ఆడబిడ్డలు ఆనందంగా ఉన్న ఇంట మహాలక్ష్మి తాండవిస్తుందని అందుకే రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500 లకే వంట గ్యాస్ సరఫరా, ఇందిరమ్మ ఇల్లు వంటి పథకాలతో పాటు సంపన్నులతో సమానంగా తెలంగాణలో మహిళలతో విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మహిళలు పెట్రోల్ బంకు నిర్వహణ, క్యాంటీన్ల నిర్వహణ చేపట్టారని, శిల్పారామంలో 100 ఇందిరా మహిళ శక్తి స్టాళ్లను సంఘాల ద్వారా 600 బస్సులు ఇప్పటికే అందజేయడం జరిగిందన్నారు.

భూ సేకరణపై కలెక్టర్ సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో సోమవారం భూ సేకరణ, పునరావాసంపై కలెక్టర్ సిక్తా పట్నాయక్ సమీక్షా సమావేశం నిర్వహించారు. నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సంబంధించి రెవెన్యూ అధికారులు ఇటీవలే నిర్వహించిన గ్రామసభలు, భూసేకరణ సర్వేపై ఎలాంటి అభ్యంతరాలు రాకపోవడంతో కలెక్టర్ ఆధ్వర్యంలో పునరావాస కమిటీ ఏకగ్రీవంగా ఆమోదం తెలపడంతో కమిటీ ఆమోదించిన నివేదికను ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ హైదరాబాద్‌కు ప్రతిపాదనలు పంపించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఆర్డీఓ రాంచంద్రనాయక్, సెక్షన్ అధికారి శ్రీధర్, సభ్యులు రవికుమార్, సతీశ్‌కుమార్, కోళ్ల కిష్టమ్మ, శివ, నారాయణపేట, మక్తల్, ఊట్కూర్, దామరగిద్ద తహసీల్దార్లు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం



మక్తల్ మండలం గొల్లపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

నారాయణపేట/మక్తల్/ఊట్కూర్/మాగనూర్/నర్వ: పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిందని కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ముందుగా జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. నారాయణపేటలో 347 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేయడం జరుగుతుందని, వెంటనే ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి పథకం దేశంలో ఎక్కడా లేదని, పదేళ్లుగా ప్రజలు ఇళ్లు, రేషన్‌కార్డుల కోసం ఎదురుచూశారని, ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇండ్లతో పాటు అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు చేస్తుందన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్, ఊట్కూర్, మాగనూర్, నర్వలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. మరికొందరు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాపాలన నడుస్తుందని, ఇళ్ల నిర్మాణాలు త్వరగతిన పూర్తి చేసుకోవాలని అన్నారు. ఇళ్లు విడతల వారిగా అర్హులైన ప్రతీ ఒక్కరికి మంజూరు అవుతాయని ఎవరూ నిరాశ చెందకూడదన్నారు.

తప్పని పరిస్థితిల్లో ప్రభుత్వ ఆస్పత్రి తరలింపు

నారాయణపేట: నారాయణపేట పట్టణంలో ఉన్న పాత ఆస్పత్రి వర్షాలకు పెచ్చులూడి శిథిలావస్థకు చేరిందని, ఆస్పత్రినికి కొనసాగించడం ప్రమాదమని ఇంజినీర్లు పేర్కొనడంతో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఆస్పత్రిని మార్చడం జరిగిందని, ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. గత పాలకులు అప్పక్‌పల్లి గ్రామం దగ్గర కట్టింది మెడికల్ కాలేజీ కాదని, అది జిల్లా ఆస్పత్రి భవనమన్నారు. ప్రస్తుతం మెడికల్ కాలేజీ నిర్మాణంలో ఉందన్నారు. మెడికల్ కాలేజీ విద్యార్థుల సౌకర్యం కోసం ప్రస్తుతం అందులో క్లాసులు జరుగుతున్నాయన్నారు. గత మూడు నెలల కింద సీఎం పర్యటనలో శిథిలావస్థలో ఉన్న జిల్లా ఆస్పత్రిపై వారి దృష్టికి వచ్చిందని, వెంటనే ఆస్పత్రిని అప్పక్‌పల్లి దగ్గరకు తరలించాలని ఆదేశించారన్నారు. జిల్లా ఆస్పత్రి కోసం మంజూరైనా కొత్త భవనాన్ని పట్టణానికి దూరంగా (అప్పక్‌పల్లి దగ్గర) నిర్మించాలనేది గత పాలకుల నిర్ణయమేనని అన్నారు. పట్టణానికి దూరంగా జిల్లా ఆస్పత్రిని తరలించడం వల్ల రోగులకు రవాణా ఇబ్బందులు తప్పవని, దీంతో ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్లు బండి వేణుగోపాల్, జి.సుధాకర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎండి సలీం పాల్గొన్నారు.

వంద రోజుల ప్రణాళిక ప్రారంభం



కోస్గిలో కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న కమిషనర్ నాగరాజు

కోస్గి రూరల్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా 100 రోజుల ప్రణాళికను సామవారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయ అవరణలో ప్రారంభించారు. ముందుగా జెండా ఆవిష్కరణను చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అమరవీరుల పోరాట ఫలితంగానే తెలంగాణ సాధించుకున్నామన్నారు. మున్సిపల్ కార్మికులకు డ్రస్సులు, వర్క్ జాకెట్స్ పంపిణీ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుండి మెప్మా, మున్సిపల్ కార్మికులతో శివాజీ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బెజ్జురాములు, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, నాగులపలి నరేందర్, అన్నకిష్టప్ప, రాజేష్, భానునాయక్ పాల్గొన్నారు.

ఘనంగా ఆవిర్భావ వేడుకలు

నారాయణపేట: రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. జిల్లా పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అదే విధంగా సీవీఆర్ భవన్‌లో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డితో కలిసి డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్‌రెడ్డి జెండా ఎగురవేశారు. మున్సిపల్ కార్యాలయం, మార్కెట్ యార్డుల్లో ఎమ్మెల్యే జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు.



- జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ యోగేష్‌గౌతమ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. సాంకేతికంగా దేశంలోనే తెలంగాణ పోలీస్ నంబర్‌వన్‌గా ఎదిగిందని ఇవన్నీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సమకూర్చుకోవడం జరిగిందని అన్నారు.
- నీళ్లు, నిధులు, నియమకాలే లక్ష్యంగా రాష్ట్ర తొలి ముఖ్య మంత్రి కేసీఆర్ నేతృత్వంలో 14 ఏళ్లుగా పోరాడి సాధించుకున్నామని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సింగారం చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సేవలు

- ఉమ్మడి జిల్లాలోని 12 చోట్ల పూర్తిస్థాయిలో అమలు
- తొలిరోజు 140 స్లాట్స్ బుకింగ్
- జిల్లాకు ముగ్గురు సబ్ రిజిస్ట్రార్ల కేటాయింపు



మెట్టుగడ్డ: ఉమ్మడి జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా అందులో పైలెట్ ప్రాజెక్ట్ కింద ఏప్రిల్ నెలలోనే మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ కార్యాలయాల్లో ఈ సేవలు ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత రెండో దశలో నారాయణపేట, కల్వకుర్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సేవలు అమలు చేసిన విషయం తెలిసిందే. కాగా.. ఉమ్మడి జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోమవారం నుంచి స్లాట్ బుకింగ్ సేవలు అందుబాటులోకి వచ్చాయని జిల్లా రిజిస్ట్రార్ రవీందర్ తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని జడ్చర్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ సేవలు పరిశీలించి కొనుగోలుదారులకు దస్తావేజులు అందజేశారు.

మరో ముగ్గురు సబ్ రిజిస్ట్రార్లు

ఉమ్మడి జిల్లాలోని అన్ని కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సేవలు ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు పారదర్శకంగా, మరింత వేగంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా రద్దీ ఎక్కువగా ఉండే కార్యాలయాలకు అదనంగా సబ్ రిజిస్ట్రార్లను కేటాయించారు. ఇందులో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల, వనపర్తి, గద్వాల కార్యాలయాలకు ఒక్కొక్కరు చొప్పున సబ్ రిజిస్ట్రార్లను కేటాయించారు. ఈ మేరకు సోమవారం జడ్చర్లలో నూతన సబ్ రిజిస్ట్రార్ భానుప్రసాద్ బాధ్యతలు సైతం స్వీకరించారు.



జడ్చర్లలో స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి దస్తావేజులు అందజేస్తున్న జిల్లా రిజిస్ట్రార్ రవీందర్ తదితరులు

అవగాహన లేకపోవడంతో..

సోమవారం స్లాట్ బుకింగ్ సేవలు ప్రారంభమైన కార్యాలయాల్లో దస్తావేజుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొన్ని కార్యాలయాల్లో సాఫీగానే సాగగా.. మరికొన్ని కార్యాలయాల్లో ప్రజలకు స్లాట్ బుకింగ్‌పై సరైన అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలోనే అలంపూర్‌లో ఒక్క స్లాట్ కూడా బుక్ కాలేదు. ఆత్మకూర్‌లో కేవలం 1 దస్తావేజు మాత్రమే రిజిస్ట్రేషన్ అయ్యింది. గద్వాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 44 స్లాట్ బుకింగ్ చేసుకోగా 35 దస్తావేజులు మాత్రమే రిజిస్ట్రేషన్ కాగా.. మిగతా 9 దస్తావేజుల అమ్మకపు, కొనుగోలుదారులు కార్యాలయానికే రాలేదు. సోమవారం స్లాట్ బుకింగ్ ప్రారంభమైన కార్యాలయాల్లో జడ్చర్లలో 40, వనపర్తిలో 45, గద్వాలలో 35, మక్తల్‌లో 7, అచ్చంపేటలో 5, కొల్లాపూర్‌లో 7, ఆత్మకూరులో ఒక స్లాట్ బుక్ అయ్యాయి.

క్లుప్తంగా

యువకుడి బలవన్మరణం

కొత్తకోట రూరల్: క్షణికావేశంలో ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన పెద్దమందడి మండలం మద్దిగట్ల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శివకుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ప్రవీణ్(35) డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. కొంతకాలంగా డ్రైవర్ పనికి వెళ్లకుండా తాగుడుకు బానిసయ్యాడు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులతో గొడవ పడిన ప్రవీణ్ క్షణికావేశంలో ఇంటి నుంచి వెళ్లిపోయి గ్రామ శివారులో గల చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రవీణ్‌కు భార్యతోపాటు కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ ఘటనపై భార్య గాయత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గోపాల్‌పేట: పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఏదుట్లలో చోటుచేసుకుంది. గోపాల్‌పేట ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. ఏదుట్ల గ్రామానికి చెందిన గుడ్ల కోటయ్య(65) ఆరోగ్య సమస్యలతో మే 30న ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వనపర్తి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. అతని కుమారుడు కుర్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. అతని భార్య గతంలోనే మరణించింది. ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి యువకుడి..

హన్వాడ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేష్ వివరాల ప్రకారం.. మద్దూర్ మండలంలోని నందిపాడు గ్రామానికి చెందిన తిమ్మప్ప, చెన్నప్ప(16)లు గత నెల 23న మండల పరిధిలోని కొత్తపేటలోని బంధువుల ఇంటికి వెళ్లారు. అదేరోజు వారు బైక్‌పై స్వస్థలానికి బయలుదేరారు. ఈక్రమంలో పిల్లిగుండు అటవీ ప్రాంతంలో దారికి అడ్డంగా అడవి పంది రావడంతో బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. చెన్నప్పకు తీవ్ర గాయాలు కావడంతో వైద్యుల సూచన మేరకు వారిని మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించారు. చికిత్స పొందుతున్న చెన్నప్ప సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు అతడి తల్లి చింతకింది మొగులమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

నారాయణపేట: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన నారాయణపేటలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. జిల్లా కేంద్రంలోని లింగయ్యగుడి సమీపంలోని కాలనీలో నివాసం ఉంటున్న అలివేలు (46) ఆదివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఇంట్లో అపస్మారక స్థితిలో పడి ఉంది. గమనించిన భర్త వెంకటేశ్వరావు భార్యను వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అనంతరం అలివేలు తల్లిదండ్రులకు భర్త వెంకటేశ్వరరావు సమాచారం అందించగా అలివేలుకు వరుసకు అన్న అయినా మడుగు రమణ అక్కడికి చేరుకొని అలివేలు మృతిపై అనుమానం ఉన్నట్లు స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. మృతురాలు అలివేలు దామరగిద్ద ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా పని చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.


ఆర్టీసీ కొత్త బ్రోచర్లను విడుదల చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ **విజయేందిర, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి**





నృత్యం.. అదరహో

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ శాఖల ప్రగతి స్టాళ్లు ఆకట్టుకున్నాయి. పలువురు విద్యార్థినులు చేసిన నృత్యాలు ఆహుతులను కట్టిపడేశాయి. బాలభవన్ ఆధ్వర్యంలో విద్యార్థినులు చేసిన వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శన అలరించింది. తెలంగాణ చరిత్రను చాటి చెప్పే పాటకు విద్యార్థినులు చేసిన నృత్యం విశేషంగా ఆకర్శించింది. బిందెలపై భరతనాట్యం చేసిన విద్యార్థినుల ప్రదర్శన అబ్బురపరిచింది. అలాగే వివిధ శాఖల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేసే విధంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్, ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభించారు. - జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్)







జూరాలకు 24 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


జూరాల రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో నీటిమట్టం

ధరూరు/ రాజోళి/ మదనాపురం/ దోమలపెంట/ ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లోలు స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆదివారం ప్రాజెక్టుకు 14వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా సోమవారం సాయంత్రానికి 24వేల క్యూసెక్కులకు పెరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో నిలిచిపోయిన విద్యుదుత్పత్తిని తిరిగి ప్రారంభించినట్లు పీజేపీ అధికారులు వెల్లడించారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 27, 987 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 67 క్యూసెక్కులు మొత్తంగా 28,804 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలకు చేరుకోగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.591 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వివరించారు.

సుంకేసులకు స్వల్ప వరద

సుంకేసుల డ్యాంకు సోమవారం స్వల్ప వరద వచ్చి చేరింది. ఎగువ నుంచి 2,390 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా ఒక గేటును తెరిచి 159 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న కేసీ కెనాల్‌కు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

రామన్‌పాడులో 1,017 అడుగులు

మదనాపురం మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం నిలకడగా కొనసాగుతుంది. సోమవారం పూర్తి స్థాయి నీటి మట్టం సముద్ర మట్టానికి పైన 1,021 అడుగులకు గాను 1,017 అడుగులకు చేరుకుంది. దీంతో జూరాల ఎడమ, కుడి కాల్వల ద్వారా వచ్చె నీటిని నిలిపివేశారు. కుడి, ఎడమ కాలువ ద్వారా తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.

7 యూనిట్లలో విద్యుదుత్పత్తి

జూరాలకు ఎగువ నుంచి వరద నీరు చేరుతుండడంతో దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో సోమవారం 7 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 4 యూనిట్ల ద్వారా 156 మెగావాట్లు, దిగువలో 3 యూనిట్ల ద్వారా 120 మెగావాట్లు విద్యుదుత్పత్తిని చేశామన్నారు. ఇందుకోసం 28 వేల క్యూసెక్కుల నీటిని వినియోగించామన్నారు. జూరాలకు పూర్తిస్థాయిలో వరద నీరు చేరిన అనంతరం 11 యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేపడుతామని వివరించారు.

శ్రీశైలంకు 30,218 క్యూసెక్కులు

జూరాలలో విద్యుదత్పత్తి చేస్తూ 27,987 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 2,231 కలిపి మొత్తం 30,218 క్యూసెక్కుల నీటిని సోమవారం శ్రీశైలం జలాశయానికి విడుదల చేశారు. ప్రస్తుతం శ్రీశైలంలో 832.3 అడుగుల వద్ద 51.9634 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 0.682 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి దిగువన ఉన్న నాగార్జున సాగర్‌కు 1,431 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


ముత్తయ్య (ఫైల్)

చారకొండ: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శంషొద్దీన్ కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం ఎల్లారెడ్డి బావిగేటుకు చెందిన మామిళ్ల ముత్తయ్య యాదవ్(40) స్వగ్రామం నుంచి చారకొండకు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో వాయిల్‌కోల్ గ్రామానికి చెందిన చిన్నయ్య ద్విచక్రవాహనంలో పెట్రోల్ అయిపోవడంతో రోడ్డు పక్క నుంచి నెట్టుకొంటూ వెళ్తున్నాడు. మర్రిపల్లి సమీపంలో ముందుగా వెళ్తున్న చిన్నయ్య బైక్‌ను ముత్తయ్య ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ముత్తయ్య తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ముత్తయ్య భార్య లక్ష్మమ్మతోపాటు ముగ్గురు ఆడపిల్లలు, కొడుకు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీ కేసులో నలుగురికి జైలుశిక్ష

కల్వకుర్తి టౌన్: చోరీ కేసులో అరెస్టయిన వారికి నేరం రుజువు కావడంతో నలుగురికి న్యాయమూర్తి జైలుశిక్ష విధించారు. ఎస్ఐ మాధవరెడ్డి కథనం ప్రకారం.. కల్వకుర్తిలోని ఓ వైన్స్ దుకాణంలో గతేడాది మే నెలలో స్థానిక ఇందిరానగర్‌కు చెందిన శివప్రసాద్, శంకర్, రాములు, రంగప్ప దుకాణంలోని క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.8 వేల నగదుతో పాటు అందులోని రూ.5 వేలు విలువచేసే ఖాళీ సీసాలను దొంగిలించారు. ఈ ఘటనపై అప్పటి పట్టణ ఎస్–2 కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితులను పట్టుకొని విచారించగా వారు నేరాన్ని ఒప్పుకున్నారు. ఈ ఘటనపై పూర్తి సాక్ష్యాధారాలతో కోర్టులో హాజరుపరిచారు. కేసు వివరాలను పరిశీలించిన జడ్జి వారందరికీ నాలుగు నెలల జైలుశిక్ష విధించినట్లు ఎస్ఐ చెప్పారు.

జెండా ఆవిష్కరణలో నిర్లక్ష్యం


దేవరకద్రలో తలకిందులుగా ఎగుర వేసిన జాతీయ జెండా

దేవరకద్ర: మున్సిపాలిటీ కేంద్రంలో జరిగిన తెలంగాణ అవతరణ దినోత్సవంలో జాతీయ జెండాను తలకిందులుగా ఎగుర వేసిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. దేవరకద్ర పాత బస్టాండ్‌లో కాంగ్రెస్ జెండా కట్ట వద్ద కాంగ్రెస్ నాయకులు సోమవారం ఉదయం జాతీయ జెండాను ఎగురవేశారు. అయితే జెండాను తలకిందులుగా కట్టారు. విషయం గమనించని కాంగ్రెస్ నాయకులు జాతీయ గీతం ఆలపించారు. ఆ తర్వాత జరిగిన పొరబాటును తెలుసుకుని జెండాను తిరిగి కిందకు దించి సరి చేసి మళ్లీ ఎగురవేశారు.

ప్రతి ఎకరాకు సాగునీరందిస్తాం


స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, శ్రీహరి

చిన్నచింతకుంట: ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని దేవరకద్ర, మక్తల్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం చిన్నచింతకుంట మండలం ఉంధ్యాల గ్రామ ఫేస్–1 పంపు హౌస్‌కు పూజలు నిర్వహించి ఒక పంపు ద్వారా 315 క్యూసెక్కుల జూరాల ప్రాజెక్ట్ నీటిని కోయిల్ సాగర్ ప్రాజెక్ట్‌కు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని ప్రాజెక్టులు, చెరువులు, చెక్కుడ్యాంలు, కుంటలను నీటితో నింపి ప్రతి ఎకరాకు సాగు నీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో అప్పంపల్లి సింగిల్ విండో డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, కురుమూర్తి స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

లీగ్‌లో మహబూబ్‌నగర్ శుభారంభం


మహబూబ్‌నగర్ జట్టుతో ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ తదితరులు

- 169 పరుగుల తేడాతో వనపర్తిపై గెలుపు
- రాణించిన యువన్, మనోజ్‌యాదవ్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రానికి సమీపంలోని సమర్థస్కూల్ మైదానంలో సోమవారం ప్రారంభమైన అండర్– 19 ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్‌లో మహబూబ్‌నగర్ జట్టు శుభారంభం చేసింది. 169 పరుగుల తేడాతో వనపర్తి జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు 50 ఓవర్లలో 282 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టు క్రీడాకారుడు యువన్ ముద్దనూరి అద్భుతమైన బ్యాటింగ్‌తో 93 బంతుల్లో 1 సిక్స్, 6 ఫోర్లతో 70 పరుగులు చేశాడు. మరో క్రీడాకారుడు మనోజ్‌యాదవ్ 41 బంతుల్లో 8 ఫోర్లతో 52 పరుగులు చేశాడు. వనపర్తి బౌలర్లు చరణ్ 4, పరమేశ్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వనపర్తి జట్టు మహబూబ్‌నగర్ బౌలర్ల ధాటికి వరుసగా వికెట్లను కోల్పోయింది. 28.2 ఓవర్లలో 113 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో మహేష్ నాయక్ 28, మాజ్ ఫర్హాద్ 26 పరుగులు చేశారు. పాలమూరు బౌలర్ మనోజ్‌యాదవ్ 8 ఓవర్లలో 15 పరుగులు ఇచ్చి 4 వికెట్లు, అంకిత్‌రాయ్ 2, రాహుల్ 2 వికెట్లు తీశారు. మంగళవారం మహబూబ్‌నగర్– నాగర్‌కర్నూల్ జట్ల మధ్య రెండో లీగ్ మ్యాచ్ జరగనుంది.

లీగ్‌లో ప్రతిభ చాటాలి..

క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఉమ్మడి జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో అండర్– 19 ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్ నిర్వహిస్తున్నట్లు ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అన్నారు. లీగ్ మ్యాచ్‌ను గెలిచిన మహబూబ్‌నగర్ జట్టును అభినందించారు. ఓడినవారు నిరాశ చెందకుండా గెలుపు కోసం పట్టుదలతో ఆడాలని సూచించారు. అండర్–19 లీగ్‌లో రాణించే క్రీడాకారులను త్వరలో జరిగే హెచ్‌సీఏ రాష్ట్రస్థాయి టోర్నీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. లీగ్‌లో క్రీడాకారులు తమ వ్యక్తిగత ప్రదర్శనను చాటుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోచ్ అబ్దుల్లా, సీనియర్ క్రీడాకారుడు రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

వనరుల దోపిడీ కోసమే ఎన్‌కౌంటర్లు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి బాలనరసింహ


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి బాలనర్సింహ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వనరుల దోపిడీ కోసమే కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో అంతం చేస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్‌నర్సింహ ఆరోపించారు. సోమవారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మావోయిస్టులను ఏరివేసేందుకు ఆపరేషన్ కగార్‌తో బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని, కనీసం వారి మృతదేహాలను కూడా అప్పగించకుండా పైశాచికానందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రవాదులను తయారు చేసే ఫ్యాక్టరీగా ఉన్న పాకిస్తాన్‌తో శాంతి చర్చలు జరుపుతున్న కేంద్రం మావోయిస్టులతో శాంతి చర్చలకు ముందుకు రాకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. కేంద్రం మిత్ర దేశంగా భావిస్తున్న అమెరికా పాలకవర్గం నేడు భారతదేశానికి యాజమాన్య దేశంగా రూపాంతరం చెందిందని వాపోయారు. గతంలో జరిగిన పాకిస్తాన్ ఇండియా యుద్ధ కాలంలో ఇందిరాగాంధీ అమెరికా ప్రభుత్వం అనుసరించిన పెత్తన ద్వంద్వనీతిని వ్యతిరేకిస్తూ బహిరంగంగా మీడియా సమావేశం బహిష్కరించిందన్నారు. కానీ ప్రధాని మోదీ ప్రభుత్వం సామ్రాజ్యవాద అమెరికాకు మోకరిల్లడం యావత్ భారతదేశ ఆత్మగౌరవం దెబ్బతీసే విధంగా ఉందన్నారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలన్నారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హునికి రాజీవ్ యువకిరణాలు పథకం ద్వారా ఆర్థిక చేయుత అందించాలని కోరారు. తెలంగాణ కోసం ఉద్యమించిన పార్టీలను, వ్యక్తులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం తొక్కి పెట్టిందని, తెలంగాణ సబండ వర్గాల సమాజం ఆశించిన ఫలితాలు స్వరాష్ట్రంలో నేటికీ సాధించ లేదన్నారు. తెలంగాణా రాష్ట్ర సాధన ఉద్యమంలో అశువులు బాసిన అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్, మాజీ జిల్లా కార్యదర్శి బి.పరమేశ్వర్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు సురేష్, రాము, అల్వాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమతి ఒక వైపు.. రవాణా మరో వైపు




మిడ్జిల్ వద్ద పట్టుబడిన ఇసుక టిప్పర్, చిన్నరేవల్లికి టీజీఎండీసీ జారీ చేసిన పాస్

ఇసుక టిప్పర్‌ను అడ్డగించిన బీజేపీ నాయకులు

జడ్చర్ల: టీజీఎండీసీ అధికారులు జారీ చేసిన పాసులకు విరుద్ధంగా ఇసుక రవాణా కొనసాగుతుందని బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా సరిహద్దులు దాటిపోతున్న ఇసుక టిప్పర్లను సోమవారం మిడ్జిల్ మండల కేంద్రంలోని వెల్జాల్ రోడ్డు మార్గంపై స్థానిక బీజేపీ నాయకులు రాజేశ్వర్, తిరుపతయ్య తదితర నాయకులు పట్టుకొని విచారించారు. టిప్పర్ డ్రైవర్ వద్ద ఉన్న టీజీఎండీసీ జారీ చేసిన అనుమతి పత్రంలో బాలనగర్ మండలం చిన్నరేవల్లి గ్రామం డెలివరీ అడ్రస్‌గా పేర్కొన్నారు. కానీ అటు వెళ్లకుండా ఇటు వైపు రావడం ఏంటని వారు ప్రశ్నించి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు తాత్సారం చేయడంతో టిప్పర్ వెళ్లిపోయిందని, టిప్పర్ రంగారెడ్డి జిల్లా పరిధిలోకి వెళ్లడంతో తామేమి చేయలేమంటూ పోలీసులు చేతుతు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక అక్రమ రవాణాకు అధికారులు, పోలీసులు సహకరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు పేర్కొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను సహించేది లేదు

సాక్షి ఎఫెక్ట్..

జడ్చర్ల: మిడ్జిల్ మండలం దుందుభీ వాగులో కొనసాగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాలపై సోమవారం అనుమతుల మాటున..శీర్షికన సాక్షిలో వచ్చిన కథనంపై స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్పందించారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల అనంతరం ఆయన మాట్లాడారు. దుందుభీ వాగులో నిబంధనలు అతిక్రమంచి ఇసుక తవ్వకాలు చేపడితే వెంటనే వాహనాలు సీజ్ చేయాల్సిందిగా స్థానిక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అక్రమాలను సహించేది లేదని మండిపడ్డారు. ఈ సందర్భంగా పోలేపల్లిలో పరిశ్రమలకు నీటి రవాణా చేస్తున్న పలువురు ఎమ్మెల్యేను కలిసి సమస్య వివరించారు. ఇటీవల విద్యుత్ విజిలెన్స్ అధికారులు తమపై కేసులు నమోదు చేశారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.

జేఈఈ అడ్వాన్స్‌లో సత్తాచాటిన 'రిషి'



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో జిల్లాకేంద్రంలోని 'రిషి' జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తాచాటారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు అభితేజ 209, సుచిత్ర 726, భానుప్రసాద్ 1,169, విజయ్‌కుమార్ 1,621, సాయితేజశ్రీ 1,664, ప్రణీత్‌కుమార్‌రెడ్డి 1,692, రాథోడ్ రమేష్ 2,321, వర్షిని 4,454, మధు 7,793, ర్యాంకులు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ చంద్రకళ వెంకటయ్య, సలహాదారు వెంకటయ్య, కళాశాల డీన్ భూపాల్, ఐఐటీ డీన్ కల్యాణ్‌బాబు, అకాడమిక్ డీన్ లక్ష్మారెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసన్న కుమారి, వెంకటరమణ, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన 'వాగ్దేవి'



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ఫలితాల్లో జిల్లాకేంద్రంలోని వాగ్దేవి కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారు. ఈ మేరకు కళాశాల విద్యార్థిని అశ్విని జాతీయ స్థాయిలో 2,610 ర్యాంకు సాధించింది. ఆమెను కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ సాధారణ విద్యార్థులచే అసాధారణ ఫలితాలు రాబట్టడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఐఐటీ ఇన్‌చార్జ్ పావనిరెడ్డి, అధ్యాపకులు యాకుబ్, గోవిందరాజులు, సందీప్, మహేష్‌గౌడ్, రాంరెడ్డి పాల్గొన్నారు.

రాజైనా రైతైనా.. కొడుకైనా కూతురైనా
కలెక్టరైనా బంట్రోతైనా.. ఊరైనా పట్నమైనా
మనిషికి ప్రాప్తమయ్యే మొదటి వాహనం సైకిల్.
దోగాడే వయసులో ట్రై సైకిల్ తొక్కి
బైస్కిల్‌కు ఎదగడమే చేయాల్సింది.
ఇక అక్కడి నుంచి ఎక్కడికి చేరినా
జీవితాన్ని బేలెన్స్ చేసుకుంటూ
ముందుకు సాగమని చెబుతుంది సైకిల్.
ప్రతి ఒక్కరి బాల్యంలో సైకిల్ విడదీయరానిది.
ఆ మాటకొస్తే సైకిల్‌లోని ప్రతి పార్ట్
జీవన సందేశాన్ని వినిపిస్తుంది.
అసలు సైకిల్‌ని ఇష్టపడని వారెవరు?


నేడు వరల్డ్ సైకిల్ డే

మొదటి వాహనముకు వందనం!



సైకిల్!

ట్రింగ్ ట్రింగ్‌మని బెల్లు కొడుతూ జ్ఞాపకాలు కమ్ముకుంటున్నాయా?

చిన్నప్పుడు ఎవరిదో ఇంటి ముందు సైకిల్ స్టాండ్ వేసి ఉంటే కింద కూచుని పెడల్ తిప్పుతూ వెనుక చక్రం గిర్రున తిరుగుతుంటే చూసిన జ్ఞాపకం. ముందు చక్రంలో వెనుక చక్రంలో స్పోక్స్ మధ్యన ఉండే ఇంద్రధనువు రంగుల కుచ్చు గుబ్బలను ఆసక్తిగా చూసిన జ్ఞాపకం. వెనుక సీటుకు డైనమో ఉంటుంది. అది ఆన్ చేస్తే బ్యాక్ టైర్‌కు అంటుకుంటుంది. టైరు తిరిగే కొద్దీ డైనమో నుంచి కరెంటు జనరేట్ అయ్యి ముందున్న బల్బు వెలుగుతుంది. ఆ రోజుల్లో రాత్రుళ్లలో లైటు వెలిగే సైకిల్ తొక్కేవాడు గొప్ప.



అవును. సైకిల్ తొక్కడం గొప్పే. ఎంతమంది దగ్గర ఉండేదని. ఒకవేళ ఉన్నా అందులో అంతరం. ర్యాలీ, హంబర్ సైకిళ్లు ఉన్నవారు శ్రీమంతులు, హీరో సైకిల్ ఉన్నవారు మధ్య తరగతి వారు, అట్లాస్ అంటే ఇక పేదవాళ్లు కొని తెగ తొక్కడమే. ఆ తర్వాత బి.ఎస్.ఎ సైకిళ్లు వచ్చాయి. వాళ్లు తెచ్చిన లేడీస్ సైకిళ్లు ఆడపిల్లలను వాటిపై కూచోబెట్టి నేరుగా స్కూళ్లకు కాలేజీలకు పంపాయి. చిన్న పట్టణాల్లో సాయంత్రాలు సైకిల్ తొక్కుతూ వెళ్లే ఆడపిల్లలకు ఉండే క్రేజ్ సామాన్యం కాదు.

మగాడికి 'మగాడు' అనిపించుకునే సవాళ్లు సమాజం పెడుతూ ఉంటుంది. ఆ సవాళ్లలో ఒకటి సైకిల్ తొక్కడం నేర్చుకోవడం. ఏడు, ఎనిమిది తరగతులకు రావడంతోటే ఊళ్లలో పల్లెల్లో పిల్లలు సైకిల్ నేర్చుకుని ఉండాల్సింది. 'ఏంటి.. మీవాడికి ఇంకా సైకిల్ తొక్కడం రాదా' అనంటే అవమాన పడిపోయే తండ్రులు ఉండేవారు. కొడుకు తిట్లతో రెచ్చగొట్టి 'సైకిల్ తొక్కుతావా లేదా' లేదా అని ఎక్కించి వెనుక పరిగెత్తుతూ నేర్పించేవారు. ఆ రోజుల్లో పిల్లలు తొక్కే సైకిళ్లు ఎక్కడివని? అన్నీ పెద్దలు తొక్కేవే. అందుకే పిల్లలు మొదట ఆఫ్ పెడల్ తొక్కి, ఆ తర్వాత ఫ్రంట్ బార్ మీద కూచుని తొక్కి, కాళ్లందే ఎత్తు పెరిగాక సీటు మీద కూచుని తొక్కేవారు.

సైకిల్ తొక్కడం అంత వీజీ కాదు. ఆ రోజుల్లో ప్రతి సైకిలూ తన యజమానిని సొంత ఊరి చెరువు నీళ్లు గటగటా తాగించేది. ఒక సైకిలుకు బ్రేకులు పడవు. ఒక సైకిల్‌కు పెడళ్లు ఊడిపోతాయి. ఒక సైకిల్‌కు చైను లూజు. మరో సైకిలుకు స్టాండ్ పడదు. స్టాండ్ వేసి జరగ్గానే ధబేలున పడుతుంది. ఒక సైకిలుకైతే సీటు అట్టగట్టుకుని పోయి కూచుంటే ముళ్ల మీద కూచున్నట్టు ఉంటుంది. ఒక సైకిలు సైడుకు లాగుతూ ఉంటుంది. ఒక సైకిలుకు హ్యాండిలు వంకర. ఇక పంక్చర్లు వేసి వేసి లోపల టైరు బ్యారుమన్నా ఓనరు కనికరించక దాన్ని తొక్కుతూనే ఉంటాడు. డబ్బులే లేని ఆ కాలంలో సైకిలే సిరి.

సైకిల్ వల్ల ఫ్రెండ్‌షిప్స్ ఏర్పడతాయి. ఫ్రంట్ రాడ్ మీద కూచుని సినిమాకొచ్చే వాడొకడు. బ్యాక్ క్యారేజీ మీద కూచుని సంతకు పోదాం అనేవాడొకడు. ఎదురుగాలిలో తొక్కుతుంటే వెనుక కూచున్నవాడు కూడా తోడు తొక్కుతాడు. అంటే రెండు పెడళ్ల మీద నాలుగు కాళ్లు. సైకిల్ డౌన్‌లో తొక్కేటప్పుడు గడ్డిపోచకంటే తేలిగ్గా ఉంటుంది. ఎదురుగాలిలో తొక్కుతుంటే రాకాసి దెయ్యమంత బరువు పెరుగుతుంది. అన్నింటి కంటే హింస ఏమిటంటే చైనుకు ఉన్న మడ్‌గార్డు గనుక పెడల్‌కు రాసుకుంటూ ఉంటే మనం వీధి వెంట వెళుతున్నామని ప్రతి ఒక్కరూ గుర్తిస్తారు.. ఆ గర్‌గర్‌మనే సౌండ్‌కి.

సైకిల్‌కు సింగారాలు చేసేవారు ఉండేవారు. హ్యాండిల్‌కు చెరొక మిర్రర్‌ని బిగించే సోగ్గాళ్లు ఉండేవారు. హ్యాండిల్ మీద ఫ్రంట్ క్యారేజ్ బిగిస్తే వాటి మీద బుక్స్ పెట్టుకోవచ్చు. సీటుకు స్పాంజ్ కవర్ చాలా షోకు. స్టీలు బిందెల మీద పేర్లు రాసినట్టు సైకిల్ హ్యాండిల్ మీద ఓనర్ పేరు రాయించడం సేఫ్. సైకిల్ దొంగతనం అయితే పోలీసులు ఆ పేరును బట్టి వాపసు చేసేవారు.

ఆ రోజుల్లో అద్దె సైకిళ్ల జమానా నడిచింది. ఐదారు సైకిళ్లు అద్దెకు ఇస్తూ బతికే వారుండేవారు. సైకిళ్లన్నీ అద్దెకెళ్లిపోతే కావాల్సిన వాళ్లు వెయిట్ చేస్తూ కూచునేవారు. కొందరైతే రేపొద్దున నాకు సైకిల్ కావాలి అని ముందే అద్దెకు మాట్లాడుకునేవారు. సైకిల్ లేకుండా పని ఎవరికి జరిగేదని? సామాన్లు తెచ్చుకోవాలన్నా, పక్కూరికి పనికి వెళ్లాలన్నా, నీళ్లు తెచ్చుకోవాలన్నా, ఎవరికైనా బాగా లేకపోతే డాక్టర్‌ని పిలుచుకు రావాలన్నా, చావు కబురు చెప్పాలన్నా సైకిలే గతి.

సైకిల్ వేదాంతి. బతుకు బండిని బేలెన్స్ తప్పకుండా చూసుకోమని, అత్యాశలకూ అతి కోరికలకూ బ్రేకులు వేస్తూ నువ్వెంత తొక్కగలవో అంతలోనే బతకమని, మంచి అనుబంధాలనే ఆయిల్‌ను తరచూ రిమ్ములకు రాస్తూ ఉండమని, మంచి చెడ్డల్లో పాల్గొంటూ సైకిల్ బెల్లులా ఉనికి చూపమని, వెనుక క్యారేజీ మీద కూచోబెట్టుకునే పాటి సహాయమైనా ఇతరులకు చేస్తూ ఉండాలని, జీవితపు పరుగుకు అప్పుడప్పుడు స్టాండ్ వేసి నిలబెట్టమని లేదంటే కనీసం సైడ్ స్టాండ్ వేయమని చెబుతుంటుంది. లేదంటే హటాత్తుగా సైకిల్ మొరాయించి ఓవరాయిలింగ్‌కు వస్తుందని హెచ్చరిస్తుంది.

సైకిల్‌లా సింపుల్‌గా బతకడం ఇవాళ చాలా కష్టమైపోతుంది. కాసింత గాలి కొడితే ఇక సైకిల్ ఏమీ అడగదు. కాని నేడు మనం ఉపయోగిస్తున్న, వాడుతున్న, అందుకోవాలనుకుంటున్న ప్రతిదీ మన నుంచి చాలా అడుగుతున్నాయి.

ఇంటి వాకిటలో నిలబెట్టిన సైకిల్ ఎంత నిమ్మళంగా ఉంటుంది!

'వరల్డ్ సైకిల్ డే' రోజున జీవితపు వేగాన్ని తగ్గించుకుని ఆస్వాదనకు పెడల్ వేద్దాం.

– కె.

ఉమెన్ సేఫ్టీ

ఆపదలో అండగా...


కరణ్



బహిరంగ ప్రదేశాల్లో మహిళల భద్రతను దృష్టిలో పెట్టుకొని మైసూర్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ స్టూడెంట్ కరణ్ సరికొత్త పరికరాన్ని తయారు చేశాడు.

ఐజీడబ్ల్యూఎస్(ఇన్నోవేటివ్ ఇంటెలిజెంట్ జియోఫెన్స్–ఎనేబుల్డ్ వేరబుల్స్ సిస్టమ్స్) అనే పరికరం మహిళలు ఆపదలో ఉంటే వారి ఎమర్జెన్సీ కాంటాక్ట్‌ను ఎలార్ట్ చేస్తుంది.

'డివైజ్‌లోని ముఖ్యమైన ఫీచర్‌లలో ఒకటి...జియోఫెన్స్–బేస్డ్ డిటెక్టర్. ఒక మహిళని ఎవరైనా మూడు నిమిషాల కంటే ఎక్కువ సేపు ఫాలో అవుతున్నప్పుడు ఈ డివైజ్ సందేహాస్పద వ్యక్తి మొబైల్ ఫోన్‌ను గాని, బ్లూటూత్ డివైజ్ అడ్రస్ గుర్తించడానికి ఉపయోగపడుతుంది' అంటున్నాడు కరణ్.

ఈ డివైజ్‌లో జియోఫెన్స్–బేస్డ్ సేఫ్టీ టైమర్ కూడా ఉంటుంది. యూజర్ ఒక డెస్టినేషన్ చేరుకోవడానికి టైమ్ సెట్ చేసుకోవచ్చు. ఒక అమ్మాయి షాపింగ్‌కు వెళ్తూ 30 నిమిషాలలో ఇంటికి వస్తానని చెబితే సిస్టమ్ ఆమె జియోలోకేషన్‌ని మానిటర్ చేస్తుంది. సెట్ చేసిన టైమ్ లోపు ఇంటి జియోఫెన్స్‌లోకి రాకపోతే డివైజ్ ఆటోమెటిక్‌గా ఆమె లోకేషన్‌ని ఎమర్జెన్సీ కాంటాక్ట్‌కి పంపిస్తుంది. డివైజ్‌లో 'రిటర్న్ హోమ్ సేఫ్టీ రిమైండర్' కూడా ఉంటుంది. డివైజ్‌లో మరో సేఫ్టీ ఫీచర్...డేంజర్–జోన్ నోటీఫైయర్. ఇది హై–రిస్క్ జీపీఎస్ లొకేషన్స్ ప్రీలోడెడ్ జాబితాను ఉపయోగిస్తుంది. యూజర్ ఈ ప్రాంతాలలోకి వెళ్లినప్పుడు వేరబుల్ బజర్ యాక్టివేట్ అవుతుంది. ఎమర్జెన్సీ కాంటాక్ట్‌కి తెలియజేస్తుంది.

సమ్‌థింగ్ స్పెషల్

దుప్పటి లెహంగా



'ఫ్యాషన్ అనేది ఫ్యాబ్రిక్ స్టోర్ నుంచి కాదు మన ఊహాల నుంచి మొదలవుతుంది' అంటారు. సిమ్రాన్ క్రియేటివిటీని చూస్తే 'నిజమే సుమీ' అనిపిస్తుంది. దిల్లీకి చెందిన కంటెంట్ క్రియేటర్ సిమ్రాన్ ఆనంద్ ఇరవై కిలోల బెడ్ షీట్‌ను ఆకట్టుకునే లెహంగాగా మార్చి ఔరా అనిపిస్తోంది.

'ఔట్‌ఫిట్ ఫ్రమ్ స్క్రాచ్' కాప్షన్‌తో ఒక వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది సిమ్రాన్.

'ఎందుకు ఇలా?' అనే ప్రశ్నకు ఆమె ఇచ్చిన జవాబు... 'బెడ్ షీట్‌లలో నాకు ఫ్యాషన్ కనిపించింది'

'లెహంగాగా మార్చడం ద్వారా దుప్పట్లకు సెకండ్ లైఫ్ కూడా ఇవ్వవచ్చు' అంటుంది సిమ్రాన్.

ఇక నెటిజనుల స్పందన విషయానికి వస్తే... 'దుప్పటితో లేహంగా ఏమిటీ!' అనే వెక్కిరింపుల కంటే...

'క్రియేటివ్ ఐడియా' అనే ప్రశంసలే ఎక్కువగా కనిపించాయి.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూన్ 2న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	97,110
బంగారం (22 క్యారెట్లు)	90,069
వెండి	99,500
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	98,670
బంగారం (22 క్యారెట్లు)	89,500
వెండి	1,00,100
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	97,910
బంగారం (22 క్యారెట్లు)	89,751
వెండి	1,01,090
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	98,670
బంగారం (22 క్యారెట్లు)	92,180
వెండి	1,00,100
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	96,250
బంగారం (22 క్యారెట్లు)	88,550
వెండి	98,600
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	97,630
బంగారం (22 క్యారెట్లు)	89,500
వెండి	1,11,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాగుబడి
రోహిణి కార్తె: జూన్ 8 వరకు
మృగశిర కార్తె: 8 నుంచి





'విత్తన బిళ్ల'లతో వరి నాట్లు!



వరి విత్తనాలతో నారుమడి పోసి, తర్వాత పొలంలో నాటేయటం మనకు తెలుసు. అయితే, కేరళకు చెందిన అజి థామస్ అనే రైతు వినూత్నంగా ట్రేలలో విత్తన బిళ్లల్లో నారు పెంచి, ఆ తర్వాత బిళ్లలతో కూడిన నారునే పొలంలో నాటుతున్నారు. ఎకరానికి 2.5-5 కిలోల వరి విత్తనాలు చాలు. 20 రోజులు ముందే పంట కోతకు వస్తోంది. కూలీల ఖర్చు 75% తగ్గింది. హెక్టారుకు 5.5-6 టన్నుల ధాన్యం దిగుబడి వస్తోందని ఆవిష్కర్త చెబుతున్నారు.

- ఆవు పేడ, పంచగవ్య, జీవామృతంతో కూడిన బయో స్లర్రీతో వరి విత్తన బిళ్లల తయారీ
- విత్తన బిళ్లల్లో పెరిగిన వరి నారుతో పొలంలో నాట్లు
- మొక్కకు 50–60 పిలకలు.. హెక్టారుకు 6 టన్నుల ధాన్యం దిగుబడి
- 75% తగ్గిన మానవ శ్రమ
- కేరళ రైతు శాస్త్రవేత్త అజి థామస్ అద్భుత ఆవిష్కరణ

కేరళలోని వయనాడ్ జిల్లా అంబలవాయల్‌కు చెందిన అజి థామస్ కూరగాయలు, అరటి, రబ్బరుతో పాటు వరిని పండిస్తారు. రైతులు తగిన ఆదాయం లేక వరి సాగు మానుకుంటున్నారు. ఈ పూర్వరంగంలో బయో స్లర్రీతో వరి విత్తనాల 'పెల్లెటైజేషన్' పద్ధతిని ఆయన అభివృద్ధి చేశారు. విత్తనం చుట్టూ మట్టిని లేపనం చేస్తే వాటిని విత్తన గుళికలు అనొచ్చు. ఇది అలా కాదు. నాలుగు పలకలుగా ఉండే పేడ తదితర పోషకాలతో కూడిన బిళ్లలో వరి విత్తనం పెంచి, నాట్లేస్తారు. కాబట్టి 'విత్తన బిళ్లలు' అని చెప్పుకుందాం.

కేరళ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు దీనిపై అధ్యయనం చేసి బయో స్లర్రీలోని సూక్ష్మజీవులు పొలం మట్టిలోని పోషకాలను విచ్ఛిన్నం చేసి వరి మొక్కలకు అందించటంతో రెట్టింపు దిగుబడి వస్తున్నదని వారు తెలిపారు.

ఈ పద్ధతిలో హెక్టారుకు 5.5–6 టన్నుల ధాన్యం దిగుబడి వస్తోందని, వయనాడ్ ప్రాంతంలో సాధారణ పద్ధతిలో వచ్చే ధాన్యం దిగుబడితో పోల్చితే రెట్టింపని థామస్ తెలిపారు. కూలీల ఖర్చు 25 శాతానికి తగ్గింది. ప్రతి కుదురుకు 50–60 పిలకలు వస్తున్నాయి. కంకి పొడవు పెరిగింది. ఎకరానికి వరి విత్తనాల అవసరం 30–50 కిలోల నుంచి 2.5–5 కిలోలకు తగ్గింది. పంట 15–20 రోజులు ముందే కోతకు వస్తోందని అజి థామస్ తెలిపారు.

విత్తన బిళ్లల తయారీ ఖర్చు ఎంత?

హెక్టారుకు సరిపడా వరి విత్తన బిళ్లల తయారీకి 12–14 కిలోల బయో–స్లర్రీ అవసరం. దీనికి హెక్టారుకు రూ. 20 వేల వరకు ఖర్చవుతుందని అంచనా. ఇది సాధారణ రసాయనిక సాగు పద్ధతిలో ఎరువులు, ఇతర ఉత్పాదకాల సగటు ఖర్చు కంటే రెట్టింపు. అయినప్పటికీ, కూలీల అవసరం/ఖర్చు, విత్తనాల ఖర్చు తగ్గి ధాన్యం దిగుబడి రెట్టింపు కావటంతో ఈ పద్ధతిలో వరి సాగు లాభదాయకంగా మారిందని థామస్ వివరించారు.

ప్రభుత్వ ప్రోత్సాహం

కేరళ ప్రభుత్వానికి చెందిన వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ (ఆత్మ) ఈ పద్ధతిని ప్రోత్సహిస్తోంది. దీంతో, ఈ పద్ధతి కేరళలో రైతుల ఆదరణ పొందుతోంది. ఇతర రాష్ట్రాల్లో కూడా రైతులు ఈ పద్ధతిని అనుసరిస్తున్నారని అజి థామస్ చెబుతున్నారు.

'విత్తన బిళ్ల' అంటే? తయారీ ఎలా?

వరి విత్తనాలను ట్రేలలోని చిన్న చిన్న చతురస్రాకారపు గదుల్లో బయో స్లర్రీని నింపి, అందులో వరి విత్తనం పెట్టి, మొలకెత్తిస్తారు. ఆ తర్వాత పొలంలో నాట్లు వేసే పద్ధతి ఇది. ఆవుపేడ, పులియబెట్టిన ఆకుల ద్రావణం, పంచగవ్య, ద్రవ జీవామృతంతో పాటు సూడోమోనాస్, అజోస్పైరిల్లమ్ వంటి జీవన ఎరువులు కలిపి బయో–స్లర్రీ మిశ్రమాన్ని తయారు చేస్తారు. బల్ల మీద ఉంచిన స్టెయిన్‌లెస్ స్టీల్ ట్రేలో లేదా సాధారణ బోలు రబ్బరు మ్యాట్‌లో 1–1.5 అంగుళాల లోతు/పొడవు/వెడల్పుతో నలుచదరంగా ఉండే గుంతల్లో బయో స్లర్రీని పోసి, అందులో వరి విత్తనాలను గుచ్చుతారు. ఒక రోజులో ఆ స్లర్రీ గట్టిపడి విత్తన బిళ్లలు తయారవుతాయి. ఆ తర్వాత ట్రే నుంచి విత్తనంతో కూడిన ఆ బిళ్లలను బయటకు తీసి 12 గంటలు ఎండబెడతారు. ఆ తర్వాత వాటిపై నీరు చిలకరిస్తారు. 3 రోజుల్లో వరి మొలకలు బయటకు వచ్చి, తగినంత ఎత్తు పెరిగిన తర్వాత, ఆ బిళ్లతో కూడిన వరి నారును దమ్ము చేసిన పొలాల్లో మనుషులతో వరుసలుగా నాటుతారు. వరుసల మధ్య 25 సెం.మీ. (పది అంగుళాలు) దూరం పెడుతున్నారు. ఎకరానికి ఇట్లాంటి వరి నారు బిళ్లలు 64 వేలు అవసరమవుతాయి. ఇదే ప్యాడీ సీడ్ పెల్లెటైజేషన్ పద్ధతి.



జటిలమైన చెదలుకు ప్రకృతిసిద్ధమైన పరిష్కారాన్ని కనుగొన్న రాజస్థాన్ వృద్ధ మహిళా రైతు

యూకలిప్టస్ కర్ర ముక్కలను పొలంలో ఉంచటం ద్వారా.. చెద పురుగులు పంటలను పాడు చెయ్యకుండా కాపాడుతున్నారు

చెదలుకు యూకలిప్టస్‌తో చెక్!

చెద పురుగులు.. ఇళ్లలోనే కాదు, పంట పొలాల్లో కూడా సమస్యలు సృష్టిస్తుంటాయి. పంటలను ఆశిస్తూ 10 నుంచి 50% వరకు దిగుబడి నష్టం కలిగిస్తుంటాయి. రైతులు సాధారణంగా రసాయనాలు చల్లి పంట పొలాల్లో చెదలును నియంత్రించే ప్రయత్నం చేస్తుంటారు. అయితే, రసాయనాలతో పని లేకుండా సులభంగా, స్వల్ప ఖర్చుతో చెదలు సమస్యకు పరిష్కారాన్ని వెదకటంలో ఓ వృద్ధ మహిళా రైతు అసాధారణమైన విజయం సాధించారు. యూకలిప్టస్ కొమ్మలు/కట్టె ముక్కలను పొలంలోని పంటల సాళ్ల మధ్య ఉంచితే, చెద పురుగులు పక్కనే ఉన్న పంటల జోలికి వెళ్లకుండా యూకలిప్టస్ కొమ్మలనే ఆశిస్తున్నాయని ఆమె కనుగొన్నారు.

తళుక్కుమన్న ఉపాయం

పనులు చేస్తూనే అసాధారణంగా ఉన్న విషయాలను గమనిస్తూ ఉండటం భగవతి దేవికి అలవాటు. వంట కలపను ఇంటికి తెచ్చి పొయ్యిలో పెడుతున్న ఒక సందర్భంలో ఆమె దృష్టిని యూకలిప్టస్ కర్రలు ఆకర్షించాయి. యూకలిప్టస్ కర్ర ముక్కల పైకి మిగతా కర్రల కంటే చాలా ఎక్కువ చెదపురుగులు చేరుతున్నట్లు ఆమె గుర్తించారు. ఈ గ్రహింపు కలిగిన మరుక్షణమే ఆమె మదిలో ఒక కొత్త ఉపాయం తళుక్కున మెరిసింది. ఆలోచన వచ్చిందే తడవుగా అప్పుడు సాగులో ఉన్న సజ్జ పంటలో అమలు చేసింది. 2 నుంచి 3 అడుగుల పొడవు, 2 నుంచి 3 అంగుళాల లావు ఉన్న యూకలిప్టస్ కర్ర ముక్కలను తీసుకొని, సజ్జ పొలం అంతటా సాళ్ల మధ్యలో పెట్టింది. ఆమె అనుకున్నట్లుగానే, ఆ కర్ర ముక్కల చుట్టూ వేలకొలది చెద పురుగులు చేరి, కర్రలను కొరికి తినటం ప్రారంభించాయి. ఆశ్చర్యమేమిటంటే.. చెద పురుగులు ఇక సజ్జ మొక్కల జోలికి పోలేదు. యూకలిప్టస్ కర్ర ముక్క నుంచి 4 అంగుళాల దూరంలో ఉన్న సజ్జ మొక్కలను కూడా అవి ఆశించలేదు. అంతే. భగవతి దేవి మోహం ఆనందంతో వెలిగిపోయింది.

సజ్జ నుంచి గోధుమ వరకు..

గోధుమ చేనులో 12×12 మీటర్ల దూరంలో ఎకరానికి 32 చొప్పున స్ప్రింక్లరు ఉంటాయి. ప్రతి స్ప్రింక్లర్‌కు దగ్గర్లో ఒక యూకలిప్టస్ కట్టె ముక్క/కొమ్మను ఆమె పెట్టారు. ఒక్క గోధుమ మొక్కను కూడా చెదలు ఆశించలేదు. ఒక్కో కట్టె ముక్కను వేలకొద్దీ చెద పురుగులు చుట్టుముట్టాయి. అంటే పంట వైపు నుంచి ఈ యూకలిప్టస్ కట్టెలు చెదపురుగుల దృష్టిని వంద శాతం మళ్లించాయన్న మాట. ఎకరానికి ఖర్చు కేవలం రూ. 320లు. ఈ కట్టెలను ప్రతి పంట కాలానికీ కొత్తవి వేయాల్సిన అవసరం లేదు. మూడు పంటల వరకు అవే సరిపోతున్నాయని ఆమె తెలిపారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయ గుర్తింపు

భగవతి దేవి ఈ విషయాన్ని ఫతేపూర్ షెఖావతిలోని కేవీకే శాస్త్రవేత్తల చెప్పారు. వరుసగా నాలుగేళ్ల పాటు అనేక పంటల్లో ప్రయోగం చేసి సత్ఫలితాలు వచ్చాయని తెలిపారు. బికనెర్‌లోని రాజస్థాన్ వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు బార్లీ పంటలోనూ అద్భుత ఫలితాలు రావటంతో, రైతులందరికీ ఇది అనుసరించమని చెబుతున్నారు.

చిరుధాన్యాలను సాళ్లుగా విత్తుకుంటే మేలు

ఐఐఎంఆర్‌లో 11 రకాల చిరుధాన్యాల విత్తనాలు సిద్ధం



హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని కేంద్ర ప్రభుత్వ సంస్థ భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (ఐఐఎంఆర్)లో ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు విత్తుకోవటానికి అనువైన 11 రకాల చిరుధాన్యాల విత్తనాలను విక్రయిస్తున్నారు. జొన్నలు, పచ్చజొన్నలు ఎకరానికి 3 కిలోలు విత్తుకోవాలి. ఇతర చిరుధాన్యాలన్నీ ఎకరానికి 2 కిలోలు సరిపోతాయని, ఎకరానికి సరిపోయే విత్తనంతో బ్యాగ్‌లను సిద్ధం చేశామని ఐఐఎంఆర్ విత్తన విభాగం సాంకేతిక అధికారి రఘునాథ్ కులకర్ణి 'సాక్షి సాగుబడి'తో చెప్పారు.

వరుసలుగా విత్తుకుంటే మేలు: చిరుధాన్య పంటలను వెదజల్లటం కాకుండా వరుసలుగా విత్తుకోవటం మేలు. కూలీలతో కలుపు తీయిస్తే రైతుకు మిగిలేదేమీ ఉండదు. వరుసలుగా విత్తుకుంటే యంత్రాలతో అంతరసేద్యం చేస్తూ కలుపును నిర్మూలించుకోవచ్చు. సాధారణంగా వరుసల మధ్య 22.5 సెం.మీ. దూరం పెడతారు. రైతులు తమకు అందుబాటులో ఉన్న సీడర్ యంత్రాల వెడల్పును బట్టి సాళ మధ్య దూరాన్ని నిర్ణయించుకోవచ్చు. అవసరాన్ని బట్టి 30 సెం.మీ. / 40 సెం.మీ. / 45 సెం.మీ. వరకు కూడా సాళ్ల మధ్య దూరం పెట్టుకోవచ్చని రఘునాథ్ వివరించారు.

- జొన్న (దేశీ రకం/ హైబ్రిడ్), పచ్చజొన్న, పచ్చిగడ్డి కోసం పెంచే జొన్న ఎకరానికి 3 కిలోలు విత్తుకోవాలి.
- సజ్జ, రాగు (కెఎంఆర్ 301), కొర్ర (సూర్యనంది), సామ (సిఎల్ఎంవి1), ఊద (డిహెచ్‌బిఎం93-3), వరిగ (టిఎన్ఎయు 202), అరిక (సికెఎంవి2), అండుకొర్ర (హెచ్‌బిఆర్2)లను ఎకరానికి 2 కిలోలు విత్తుకోవాలి. ఈ విత్తనాలు ఐఐఎంఆర్‌లో అందుబాటులో ఉన్నాయి. రైతులు స్వయంగా వచ్చి కొనుక్కోవాలి. ఇతర వివరాలకు.. 040-24599305.

చిరుధాన్యాల విత్తనాలు దొరికే ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాలు: నంద్యాల (99896 25208), పెరుమామళ్లపల్లి (87906 38715), పాలెం (97050 69580)లలోని కూడా కొన్ని రకాల చిరుధాన్య పంటల విత్తనాలు అందుబాటులో ఉంటాయి.